క్లుప్తంగా

నేడు ఘనంగా బోనాల వేడుకలు



అంబర్‌పేట: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల వేడుకలకు సర్వం సిద్ధమైంది. నియోజకవర్గ వ్యాప్తంగా అమ్మవారి ఆలయాలు ముస్తాబు కాగా.. నేడు నిర్వహించనున్న బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అంబర్‌పేట ప్రధాన రోడ్డులో ఉన్న మహంకాళి అమ్మవారి ఆలయం వద్ద బోనాలు నిర్వహించేందుకు నిర్వాహకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు.

దూరవిద్యలో అడ్మిషన్లు ప్రారంభం

కాచిగూడ: దూరవిద్య ద్వారా డిగ్రీలో బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, పీజీలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆదిత్య డిస్టెన్స్ కాలేజీ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ చిట్టిమల్ల శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ కోర్సులకు కూడా అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు.

న్యూ రామాలయంలో శనిత్రయోదశి పూజలు



అభిషేకం అనంతరం హారతి ఇస్తున్న అర్చకస్వామి

నల్లకుంట: మాసశివరాత్రి, శనిత్రయోదశి సందర్భంగా న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి దేవాలయం భక్తులతో పోటెత్తింది. శనివారం ఉదయం పర్వత వర్ధిని సహిత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అర్చకస్వామి విశేష అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని పూల మాలలతో అలంకరించి అర్చనలతో హారతులు ఇచ్చారు. భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ జరిగింది. నవగ్రహాలయంలో భక్తులు స్వయంగా శనిదేవుడికి తైలాభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అర్చకస్వామి మంత్రోచ్ఛరణల మధ్య నవగ్రహ పూజలు నిర్వహించారు.

సేవా కార్యక్రమాలు సంతృప్తినిస్తాయి

చిక్కడపల్లి: సేవా కార్యక్రమాలు సంతృప్తినిస్తాయని నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్ అన్నారు. శనివారం రేణుకా శక్తి సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ అంగన్‌వాడి కేంద్రంలో కుక్కర్ ప్రదానంతో పాటు ఆంధ్రవిద్యాలయం ఎయిడెడ్ పాఠశాల, అరుంధతీనగర్‌లోని స్కూల్ విద్యార్థులకు జామెట్రీ బాక్స్‌లు, పండ్లు పంపిణీ చేశారు. నాయకులు చంద్రకళ, సృజన, జశ్వంత్, కృష్ణయాదవ్, సురేందర్, సురేష్, సుబ్బారావు తదితరులున్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వి.శ్రీనివాస్‌రెడ్డి, రేశం మల్లేష్ తదితరులు

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ మేదర బస్తీ పోచమ్మ దేవాలయంలో ఘనంగా బోనాలను నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ డివిజన్ మాజీ అధ్యక్షులు రేశం మల్లేష్ అన్నారు. శనివారం రాంనగర్‌లో రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, కార్మిక నాయకుడు వి.శ్రీనివాస్‌రెడ్డి, రేశం మల్లేష్‌లు సమావేశం నిర్వహించారు. బోనాల ఏర్పాట్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ నాయకులు సిరిగిరి శ్యామ్, నేత శ్రీనివాస్, కల్వ గోపి, భిక్షపతి, బుజ్జి వెంకటేశ్వర్లు, వీరస్వామి, టక్కర్ శ్రీను, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

- ప్రశాంత వాతావరణంలో బోనాలు నిర్వహించుకోవాలని వి.శ్రీనివాస్‌రెడ్డి ప్రజలకు సూచించారు. దీనికి పోలీసులు సహకరించాలని, ఫలహారపు బండ్ల ఘటాలను త్వరగా బయటకు తీసి తొందరగా ముగించాలని కోరారు. ఎలాంటి ఘర్షణలకు తావివ్వకూడదని స్పష్టం చేశారు.

పండుగ ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్

చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నేడు జరగనున్న బోనాల ఉత్సవాలను అందరూ ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఇన్‌స్పెక్టర్ ఎన్.సంజయ్‌కుమార్ సూచించారు. చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, గాంధీనగర్, ఆర్టీసీక్రాస్‌రోడ్స్, రామ్‌నగర్, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలను శనివారం సాయంత్రం ఆయన సందర్శించి బందోబస్తుపై చర్చించారు.

- గాంధీనగర్ డివిజన్‌లోని వివిధ బస్తీల్లో బోనాల సందడి నెలకొంది. చిక్కడపల్లి బాపునగర్ నల్లపోచమ్మ ఆలయం వద్ద ఉత్సవాలకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.
- ఎస్ఆర్‌టీ నల్లపోచమ్మ, ఉప్పలమ్మ దేవాలయం వద్ద విద్యుత్ దీపాల అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆదివారం ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ సాయికీర్త్ తెలిపారు.

బోనాల ఉత్సవాలకు భారీ బందోబస్తు..

లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ ఆలయాన్ని సీఐ శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. దోమలగూడ పోలీస్ స్టేషన్‌పరిధిలో 13 అమ్మవారి ఆలయాల ఉన్నాయి. బందోబస్తుకు ఇద్దరు సీఐలు, పదిమంది ఎస్సైలు, 34 మంది ఉమెన్ పీసీలు, 50 మంది సిబ్బంది మొత్తం 110 మంది సిబ్బంది ఉన్నారు. రోడ్లపై తాగుతూ.. ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





ప్యాచ్‌వర్క్స్ నిర్వహిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

దేవాలయాల వద్ద ప్యాచ్‌వర్క్స్..

చిక్కడపల్లి: బోనాల పండుగ సందర్భంగా గాంధీనగర్ డివిజన్‌లోని ఎస్ఆర్‌టీ కాలనీ నల్లపోచమ్మ, ఉప్పలమ్మ దేవాలయం, వీవీ గిరినగర్, ఎల్లయ్యబస్తీ, చిక్కడపల్లి, వివేక్‌నగర్ పలు బస్తీల అమ్మవారి దేవాలయాల్లో గుంతలు పడిన రోడ్లకు ప్యాచ్‌వర్క్స్ చేశారు. డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు వినయ్‌కుమార్ జీహెచ్ఎంసీ సిబ్బందితో మరమ్మతులు చేయించారు. పండుగ నేపథ్యంలో అమ్మవారి దేవాలయాల వద్ద చెత్త, వ్యర్థాలను వేసేందుకు కవర్లను పంపిణీ చేశారు. డివిజన్ వ్యాప్తంగా అమ్మవారి దేవాలయాల వద్ద జీహెచ్‌ఎంసీ ద్వారా సహాయక చర్యలు చేపడుతున్నామన్నారు. బీజేపీనేతలు సంతోష్, స్థానికులు బాబ్జీ, ఆకుల శివ, గణేష్, కోటి, ఎస్ఆర్‌టీ శివ, రాము తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్‌లో పలు దేవాలయాల వద్ద రోడ్లకు ప్యాచ్‌వర్క్స్‌ను రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రావులపాటి మోజెస్ శనివారం పర్యవేక్షించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్‌ముదిరాజ్, శ్రావణ్‌కుమార్, శ్రీధర్‌శర్మ, సదానంద్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం బీసీలకు మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి



ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ముషీరాబాద్: కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి కులగణన చేపట్టాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే, బీజేపీ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దేశంలో కేంద్ర ప్రభుత్వాలు గత 75 ఏళ్లుగా బీసీలకు ఏ రంగంలోనూ జనాభా ప్రాతిపదికన వాటా ఇవ్వలేదని విద్య, ఉద్యోగ, రాజకీయ ఆర్థిక, సామాజిక రంగాల్లో కనీస ప్రాతినిధ్యం లభించలేదన్నారు. దేశంలో 66 శాతం జనాభా కలిగిన బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించకుండా బీసీకులాలను అణచిపెట్టారని ఆరోపించారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని దీనికి రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, నీల వెంకటేష్, నందగోపాల్, సుధాకర్‌జోషి తదితరులు పాల్గొన్నారు.

ధార్మిక భావనలు సమాజశాంతికి దోహదం



ఆభరణాలను అందజేస్తున్న హరియాణా గవర్నర్ దత్తాత్రేయ

చిక్కడపల్లి: ధార్మిక భావనలు సమాజశాంతికి దోహదపడతాయని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. శనివారం ఆర్టీసీక్రాస్ రోడ్స్ వద్ద ఉన్న శృంగేరి సంస్థాన్ పంచముఖ హనుమత్ లక్ష్మీసమేత వేంకటేశ్వరస్వామి వారిని శనివారం ఆయన దర్శించుకుని రజత ఆభరణాలను ఆలయ అధికారి కళా జనార్దనమూర్తికి అందజేశారు. వేద మంత్రోచ్చరణల మధ్య స్వామివారు నూతన ఆభరణాలతో వేదపండితులు అలంకరించారు. ఆలయాల అభివృద్ధిలో ప్రజలు పాలుపంచుకోవాలని జనార్దనమూర్తి కృషి అభినందనీయమన్నారు. ఆదాయపు పన్నుల శాఖ విశ్రాంత అధికారి సాయి, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు చర్యలు



వినతిపత్రం అందజేస్తున్న కే.ఎస్.ప్రదీప్

ముషీరాబాద్: సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని పీవైఎల్, పీఓడబ్ల్యూ ప్రతినిధుల బృందం ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు. శనివారం వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలు, పట్టణ, నగరాల్లో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్లు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయన్నారు. ఆదివాసీలు నివసిస్తున్న ప్రాంతాల్లో పల్లెలకు పల్లెలే మంచానపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో మెరుగైన వైద్యం అందక వృద్ధులు, చిన్నారులు మృత్యువాతపడుతున్నారన్నారు. కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు, మెడికల్ షాపులు రోగులను దోపిడీకి గురిచేస్తున్నాయన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఎస్.ప్రదీప్, నాయకులు రవికుమార్, కృష్ణ, బంగారి శ్రీనివాస్ తదితరులున్నారు.

పరామర్శ



అంబర్‌పేట: బీజేపీకి 30 ఏళ్లుగా బండారు సంతోష్ చేసిన సేవలు చిరస్మరణీయమని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. కాచిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న సంతోష్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం బాగ్‌అంబర్‌పేటలోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను గవర్నర్ పరామర్శించారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటన్నారు. బీజేపీ నేతలు డాక్టర్ ఎన్.గౌతంరావు, వెంకట్‌రెడ్డి, జగన్, కన్నె రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్ సేవలు స్ఫూర్తిదాయకం



నివాళులర్పిస్తున్న బీజేపీ నేత ఎన్.గౌతంరావు

అంబర్‌పేట: ప్రముఖ స్వాతంత్ర సమరయోధురాలు దుర్గాబాయి దేశ్‌ముఖ్ సమాజానికి అందించిన సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. శనివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ డీడీ కాలనీలో ఉన్న దుర్గాభాయి దేశ్ విగ్రహం వద్ద జరిగిన ఆమె జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సంస్కర్తగా దుర్గాభాయి దేశ్ అందించిన సేవలు సమాజానికి నేటికి ఉపయోగపడుతున్నాయన్నారు. మహిళల విద్య, న్యాయంపై ఆమె చేసిన సేవలు ఎంతో గొప్పవన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, గోవర్ధన్‌రెడ్డి, సీవీ ప్రసన్న, రమేష్‌రెడ్డి, పాండురంగయ్య, వెంకట్‌గౌడ్, వీణ దిగ్గీకర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి పెద్దపీట



పచ్చదనాన్ని పరిశీలిస్తున్న డీఎంసీ డాక్టర్ తిప్పర్తి యాదయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గ్రేటర్ హైదరాబాద్‌లో పారిశుద్ధ్యం, పరిశుభ్రత, పచ్చదనానికి పెద్దపీట వేస్తున్నామని జీహెచ్ఎంసీ సర్కిల్–15 డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య అన్నారు. శనివారం ఉదయం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో పారిశుద్ధ్యంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. స్థానికులు పరిసర ప్రాంతాల్లో చెత్త సమస్య లేకుండా చూడాలని కోరడంతో పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మెరుగైన పారిశుద్ధ్యం కోసం మరింత దృష్టిసారిస్తామని ప్రజలు కూడా పారిశుద్ధ్యంపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ హౌజ్‌ఫెడ్ డైరెక్టర్ ఐలినేని కిషన్‌రావు, బీజేపీ సీనియర్ నాయకులు సత్యనారాయణమూర్తి, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ఆమ్‌ఆద్మీ పార్టీ ముషీరాబాద్ కన్వీనర్ రాకేష్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రతిభా ప్రోత్సాహానికి వంశీ సంస్థ ప్రాధాన్యం

చిక్కడపల్లి: యువ ప్రతిభ ప్రోత్సాహానికి వంశీ సంస్థ ప్రాధాన్యతనిస్తుందని వ్యవస్థాపకులు డాక్టర్ వంశీ రామరాజు తెలిపారు. త్రిష్య రాఘవన్ కర్ణాటక సంగీత గానగోష్ఠి జరగగా.. త్యాగరాయగానసభలో వంశీ ఇంటర్నేషనల్ అవార్డును బహుకరించారు. వయోలిన్ కళాకారుడు అశోక్ గుర్జాలే, ప్రముఖ గాయనీ శ్రీనిధి మాట్లాడుతూ.. విదేశాల్లో ఉండి శాస్త్రీయ సంగీతం నేర్చుకుని ఆత్మవిశ్వాసంతో త్రిష్యగానం చేశారని కొనియాడారు.

పద్మశాలీలకు అండగా ఉంటాం



ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను కలిసిన అంబర్‌పేట పద్మశాలీ సంఘం నేతలు

కాచిగూడ: నియోజకవర్గం పద్మశాలీలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. అంబర్‌పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం అధ్యక్షుడు వర్కాల కృష్ణ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటైన కమిటీ శనివారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఉన్న ప్రతీ పద్మశాలి ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలను అర్హులైన వారికి అందేలా చూస్తానని హామీ ఇచ్చామన్నారు. చిలుక శివకుమార్, భీమనపల్లి అశోక్, అంజయ్య, గంగిశెట్టి సత్తయ్య, కె.సత్యనారాయణ, తీగల నరేందర్, బోగ వెంకటయ్య, గంగిశెట్టి మల్లేశం, మధుసూదన్, ఆవుల రాములు, దామోదర్, గుర్రం శ్రీనివాస్ తదితరులున్నారు.

సంప్రదాయాలను విద్యార్థులకు నేర్పాలి



బోనాల పండుగను నిర్వహిస్తున్న విద్యార్థులు

ముషీరాబాద్: రాంనగర్‌లోని కాకతీయ హైస్కూల్‌లో బోనాల పండుగను పురస్కరించుకుని తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను విద్యార్థులకు నేర్పుతున్నామని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం స్కూల్‌లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బోనాలతో పాటు అమ్మవారు, పోతరాజుల వేషధారణలతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. స్కూల్ జోనల్ హెడ్ రమేష్‌చంద్ర, రాంనగర్ కాకతీయ హైస్కూల్ కరస్పాండెంట్ నవీన్, ప్రిన్సిపాల్ రామరాజు బల్వంత్‌రావు పాల్గొన్నారు.

మదర్స్ హైస్కూల్‌లో..

- రాంనగర్‌లోని మదర్స్ హైస్కూల్‌లో విద్యార్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలను సమర్పించారు. పాఠశాల కరస్పాండెంట్ ప్రకాష్, సమయ్య, ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి, బోనాల ప్రాజెక్టు ఉపాధ్యాయులు సరళ, పద్మావతి, శివరంజనీ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్‌తో వి.శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ మేదర్‌బస్తీలో పోచమ్మ దేవాలయం ఎదుట గత 15 రోజులుగా డ్రైనేజీ సమస్య ఉందని స్థానికులు వాపోతున్నారు. నేడు బోనాల సందర్భంగా మహిళలు బోనం ఎత్తుకుని ఆలయాలకు ఎలా వస్తారని మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు, మేనేజర్లకు అనేకసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో స్థానికులతో కలిసి చిలకలగూడ డీజీఎం మోహన్‌రాజును ఆయన కలిశారు. సానుకూలంగా స్పందించిన డీజీఎం ఎయిర్‌టెక్ మిషన్‌ను పంపించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో మల్లేష్, కల్వ గోపి, నేత శ్రీనివాస్, రమేష్, సిరిగిరి శ్యామ్, కార్తీక్‌యాదవ్, సిద్దిక్, అజ్జు తదితరులున్నారు.

చదువుతో పాటు సమాజాన్ని చదవాలి

ముషీరాబాద్: విద్యార్థులు చదువుతో పాటు సమాజాన్ని కూడా చదవాలని పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. శనివారం విద్యానగర్‌లోని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యాలయం మార్క్స్ భవన్‌ల రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రంగారావు మాట్లాడుతూ.. కేంద్రం విద్యార్థి వ్యతిరేక విధానాలు, ప్రజావ్యతిరేక విధానాలను తీసుకొస్తుందని ఆరోపించారు. మణిపూర్ రాష్ట్రంలో జాతుల మధ్య అల్లర్లు సృష్టిస్తున్నారని విమర్శించారు. పీడీఎస్‌యూ జాతీయ నాయకులు ఎస్.నాగేశ్వర్‌రావు, కార్యదర్శి ఆజాద్, సంధ్య, నర్సింహ్మ, స్వాతి, పృథ్వీ, అనిల్, సాయి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు విద్య తోడ్పాటు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: క్రమ శిక్షణ గల విద్య ఉన్నత శిఖరాలకు తోడ్పాటునిస్తుందని అంబేడ్కర్ విద్యా సంస్థల జాయింట్ సెక్రటరీ పీ.వీ.రమణకుమార్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంబీఏ కళాశాలలో ఫేర్‌వేల్ పార్టీ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన రమణకుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవడంతో పాటు నూతన విద్యావిధానాన్ని అనుసరించాలని సూచించారు. విద్యార్థులకు చదువుతో పాటు పట్టుదల, క్రమ శిక్షణ ఉండాలని ఆకాంక్షించారు. నైపుణ్యతతో పాటు హార్డ్‌వర్క్ ఉంటేనే సక్సెస్ అవుతారని అభిప్రాయపడ్డారు. ఎంబీఏ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. కళాశాల డైరెక్టర్ డాక్టర్ రిషికాంత్, డాక్టర్ రత్న, అడ్మినిస్ట్రేటర్ కిరణ్‌కుమార్ ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

మెయిన్‌చెరువు కట్టపై బోనాలకు సహకరించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: బాగ్‌అంబర్‌పేట డివిజన్‌కు సమీపంలో ఉన్న మెయిన్ చెరువు కట్టపై ఉన్న అమ్మవారి ఆలయం వద్ద బోనాల వేడుకలు నిర్వహించుకునేందుకు సహకరించాలని డివిజన్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ వీసీ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. మెయిన్‌చెరువు ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోకి రానుండటంతో భక్తులకు ఈ నెల 16,17వ తేదీల్లో అనుమతి ఇవ్వాలని ఆమె వీసీని కోరారు. బీజేపీ నేతలు వెంకట్‌రెడ్డి, మీరియాల శ్రీనివాస్, మనోజ్, గోవింద్ అర్జున్, రామ్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులున్నారు.

క్రీడల్లో నైపుణ్యం సాధించాలి



మాట్లాడుతున్న జువైనల్ హోమ్స్ డిప్యూటీ డైరెక్టర్

కాచిగూడ: ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ జువైనల్ హోమ్స్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మీర్జా రాజా ఆలీబేగ్ అన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కాచిగూడ, నింబోలిఅడ్డాలోని బాలికల జువైనల్ హోమ్‌లో శనివారం 'నయా దిశ' (కొత్త మార్గం) కార్యక్రమం ద్వారా పిల్లల్లో పరివర్తన తీసుకురావడానికి క్రీడల్లో శిక్షణను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వాలీబాల్, చెస్, క్యారమ్స్‌లో ప్రత్యేకకోచ్‌లను ఏర్పాటు చేసి పిల్లలకు శిక్షణను ఇప్పిస్తామన్నారు. క్రీడా సామగ్రితో పాటు క్రీడాడ్రెస్‌లు, కిట్లను పంపిణీ చేశారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనిల్‌కుమార్, కుమార్, కె.శ్రీనివాస్, జువైనల్ హోమ్ సూపరింటెండెట్ కృష్ణవేణి, ఐటీసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రమేష్‌రెడ్డి, పీ.వీ.నిరంజన్‌రెడ్డిలు తెలిపారు. శనివారం సుందరయ్య పార్కులో వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో యోధా డయగ్నోస్టిక్ సెంటర్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వివిధ రకాల టెస్టులను ఉచితంగా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నడకతో పాటు ఆరోగ్యంపై దృష్టిసారించినప్పుడే కలకాలం జీవిస్తారని పేర్కొన్నారు. హౌజ్‌ఫెడ్ డైరెక్టర్ కిషన్‌రావు, మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ రాఘవరెడ్డి, క్లబ్ మాజీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కె.నర్సింహ్మ, రమేష్‌రెడ్డి తదితరులున్నారు.

'అలమేల్మంగ శతకం' ఆవిష్కరణ

చిక్కడపల్లి: కల్యాణి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో ప్రముఖ రచయిత నోరి రఘురామమూర్తి రచించిన 'అలమేల్మంగ శతకం' ఆవిష్కరణ జరిగింది. శనివారం పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రముఖ సినీ నిర్మాత రామ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక రచనలు సమాజంలో మంచిని పెంపొదిస్తాయన్నారు. పుస్తకాల్లోని స్థితిని గ్రహించి మసులుకుంటే జీవితంలో ఎంతో పైకి ఎదగవచ్చని సూచించారు. సమాజశాంతికి దోహదం చేసే ఇలాంటి రచనలు మరిన్ని రావాల్సి ఉందన్నారు. మైన్స్‌శాఖ మాజీ డైరెక్టర్ వీడీ రాజగోపాల్, ప్రముఖ కవి దోరవేటి కవి, గోపాల్ ఆచార్య, భవాని జగదీశ్వర్‌రెడ్డి, రాధాకుసుమ, కళా తాటికొండ, వెంకటకల్యాణి తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన స్టీల్‌బ్రిడ్జి నిర్మాణ పనులు

చిక్కడపల్లి: స్టీల్‌బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని తెలంగాణ జనసమితి ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్, గాంధీనగర్ డివిజన్ కన్వీనర్ రవీందర్ యాదవ్ ఆరోపించారు. శనివారం సాయంత్రం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం మూడేళ్ల క్రితం చేపట్టిన స్టీల్‌బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో పాదచారులు, స్థానిక దుకాణాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మే నెల మొదటివారంలో పూర్తి చేస్తామని చెప్పిన ప్రభుత్వం జూలై నెలాఖరువచ్చినా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. స్టీల్‌బ్రిడ్జి అవసరమే లేకపోయినా కూడా నిర్మాణం చేస్తున్నారని అది కూడా నత్తనడకన సాగుతుందని వారు ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి స్టీల్‌బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.